www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

19వ డివిజన్‌కు 92 కొత్త పింఛన్లు మంజూరు!

లబ్ధిదారులకు స్వయంగా ఫోన్ చేసి సమాచారం అందించిన మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా



5

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 287 ఆదివారం 15-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5

కొత్తగూడెం గగనతల కలకు రెక్కలు!

- సుజాతనగర్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- 667 ఎకరాల భూమిని ఎంపిక చేసిన ఏఏఐ
- కూనంనేని నిరంతర కృషితో కీలక ముందడుగు.. త్వరలో భూసేకరణ ప్రక్రియ



కారేపల్లి, నవంబర్ 10 (భద్రాద్రి న్యూస్):

కొత్తగూడెం అర్బన్ , నవంబర్ 14 (భద్రాద్రిన్యూస్):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దశాబ్దాల విమానాశ్రయ కల సాకారమయ్యే దిశగా కీలక ముందడుగు పడింది. సుజాతనగర్ మండల పరిధిలో విమానాశ్రయ ఏర్పాటుకు అనుకూలంగా కేంద్ర విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) స్థలాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇందుకోసం సుజాతనగర్ వద్ద 667 ఎకరాల భూమిని గుర్తించడం జిల్లాలో సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. జిల్లాలో విమానాశ్రయ ఏర్పాటుకు అనువైన ప్రాంతం కోసం పెనగడప, పాల్వంచ-దుమ్ముగూడెం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, సీతంపేట, మిగతా 2లో..

విషవాయువులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి

అధికారుల నిర్లక్ష్యంతో రోగాల బారిన పడుతున్నాం

నివాసాల మధ్య చెత్త డంప్ చేయడం దుర్మార్గం

బాధితుడు కోట రమేష్



3



బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు చేరాలంటే ఓబీ తొలగింపులో వేగం పెంచాలి!

కొత్తగూడెం రీజియన్‌లో రోజుకు 5.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి

నాలుగు ఏరియాల ఓబీ ఏజెన్సీలకు సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశం

అలసత్వం వహించే ఏజెన్సీలపై ఉదాసీనత ఉండదు.. స్పష్టం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్):

సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలంటే ఓవర్ బర్డెన్ (ఓబీ) తొలగింపులో వేగం పెంచాలని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి ఆదేశించారు. కొత్తగూడెం రీజియన్ పరిధిలోని కొత్తగూడెం, సత్తుపల్లి, మణుగూరు, ఇల్లందు నాలుగు ఏరియాల్లో రోజుకు మొత్తం 5.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు లక్ష్యాన్ని తప్పనిసరిగా చేరుకోవాలని స్పష్టం చేశారు. లక్ష్యాలకు అనుగుణంగా అవసరమైన యంత్రాలు, మానవ వనరులను ఏజెన్సీలు సమకూర్చుకోవాలని సూచించారు.

శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కొత్తగూడెం రీజియన్‌లోని ఓపెన్‌కాస్ట్ గనుల బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు, బొగ్గు రవాణా తదితర అంశాలపై ఏరియా జనరల్ మేనేజర్లు, ఓబీ ఏజెన్సీల ప్రతినిధులతో సీఎండీ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు ప్రతిరోజూ 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో పాటు ఇంధన సరఫరా ఒప్పందాలు కలిగిన ఇతర విద్యుత్ కేంద్రాల అవసరాలను కూడా తీర్చాల్సి ఉందన్నారు.

సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలంటే రోజుకు 14.15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు జరగాలని పేర్కొన్నారు. ఇందులో కొత్తగూడెం రీజియన్ నాలుగు ఏరియాల వాటా 5.5 లక్షల క్యూబిక్ మీటర్లుగా నిర్దేశించారు. ప్రతిరోజూ లక్ష్యానికి అనుగుణంగా ఓబీ తొలగిస్తేనే దాని కింద ఉన్న బొగ్గును వెలికితీసే అవకాశం ఉంటుందని వివరించారు. ఓబీ తొలగింపులో నిర్లక్ష్యం వహించే మిగతా 4లో..

కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద, బలహీన వర్గాలకు చేయూత



- పాల్వంచలో మహిళలకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ
- పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ ,నవంబర్ 14 (భద్రాద్రిన్యూస్):-

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాల ద్వారా చేయూత అందుతోందని పాల్వంచ సహకార సంఘం అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.

శనివారం పాత పాల్వంచ 46వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి ఆధ్వర్యంలో మహిళలకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్వాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ విమలాదేవి లబ్ధిదారులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రామసహాయం మిగతా 2లో..

ఘనంగా బాలల దినోత్సవం

మణుగూరు , నవంబర్ 14(భద్రాద్రిన్యూస్):-

నవంబర్ 14 పురస్కరించుకొని సుందరయ్య నగర్ లోని బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతకుముందు నిర్వహించిన డ్రాయింగ్, డాన్స్, ఒకాబులరీ వంటి పోటీలలో గెలుపొందిన చిన్నారులకు కరస్పాండెంట్ రమ, రాంబాబులు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి బాలలే రేపటి పౌరులని పిల్లల పట్ల చిన్ననాటి నుండే తల్లిదండ్రులు క్రమశిక్షణ అలవర్చి సమాజానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులుగా మా బాధ్యత విద్యార్థుల ఎదుగుదల తీర్చిదిద్దడంలో ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రీష్మ, అలేఖ్య, జ్యోతిక, హరిత, సామ్రాజ్యం తదితరులు ఉన్నారు.





కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద, బలహీన వర్గాలకు చేయూత

మొదటిపేజీ తరువాయి

రఘురాంరెడ్డి, రేణుకా చౌదరి చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీకి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకత్వానికి మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ.. ఒకే విడతలో 4.50 లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. పాల్వంచ పట్టణ, మండల పరిధిలో మొత్తం 1,387 చేయూత పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. పేదలు, మహిళలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ దామెర్ల నరేష్, నాయకులు సయ్యద్ యాకూబ్, కఠారు చంద్రశేఖర్‌రావు, షేక్ ఖాజామియా, షేక్ కరీం, బొందిల శేషగిరి, మసనం శరత్, బూసి శ్రీను, యడ్ల ముత్యం, ధర్మరాజుల రమేష్, కే. లక్ష్మణ్, యాటా నాని, మురహరి నాగరాజు, కంభంపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







శ్రీ రాగ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం క్రీడా దినోత్సవ వేడుకలు

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 14(భద్రాద్రిన్యూస్) :-

స్థానిక కొత్తగూడెం పట్టణంలోని మెదరబస్తీ పరిధిలో గల శ్రీ రాగ ప్లే అండ్ హై స్కూల్లో శనివారం బాలల దినోత్సవం మరియు క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ముందుగా పాఠశాల కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గత రెండు రోజులుగా పాఠశాలలో నిర్వహించిన వివిధ ఆటలు, పాటలు, క్రీడా మరియు ఇతర పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు బహుమతులు అందజేశారు.
అదేవిధంగా ప్లే స్కూల్ చిన్నారులు, విద్యార్థులు వివిధ రకాల ఫ్యాన్సీ డ్రెస్సులతో అందరినీ ఆకట్టుకోగా, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, ఉపన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
ప్రతి సంవత్సరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో బాలల దినోత్సవంతో పాటు క్రీడా దినోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.
ఉపాధ్యాయులు వివిధ ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి చిన్నారులను ఆనందోత్సాహాల్లో ముంచెత్తారు. ఈ వేడుకలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.



రైతులు సహకార వారోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలి

- **సహకార రంగంపై అవగాహనతో రైతులకు మరింత ప్రయోజనం**
- **పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు**

పాల్వంచ ,నవంబర్ 14 (భద్రాద్రిన్యూస్) :-

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్న 73వ సహకార వారోత్సవాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాల్వంచ సహకార సంఘం అధ్యక్షులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.
73వ సహకార వారోత్సవాల సందర్భంగా శనివారం పాల్వంచ సహకార సంఘం కార్యాలయం ఎదుట ఆయన సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో ప్రతిరోజూ ఒక్కో అంశంపై రైతులకు సహకార రంగం గురించి అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సహకార రంగం అభివృద్ధితో పాటు రైతులకు మరిన్ని ప్రయోజనాలు చేకూర్చడం, సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని వివరించారు.
ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు కసగాల నారాయణరావు, జరబన సీతారాంబాబు, చౌగాని పాపారావు, భూక్యా కిషన్, సొసైటీ సీఈఓ జి. లక్ష్మీనారాయణ, మురళి, శివ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం గగనతల కలకు రెక్కలు!

మొదటిపేజీ తరువాయి

సుజాతనగర్ తదితర ఆరు ప్రాంతాల్లో ఏఏఐ బృందం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించింది. భూమి లభ్యత, వాతావరణ పరిస్థితులు, వరద ముప్పు తదితర అంశాలను అధ్యయనం చేసిన అనంతరం సుజాతనగర్ ప్రాంతాన్ని అనుకూలమైన స్థలంగా ఎంపిక చేసి సాధ్యాసాధ్యాల నివేదికను సమర్పించినట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందినట్లు వెల్లడవుతోంది.

కూనంనేని కృషితో కీలక ముందడుగు..

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమానాశ్రయ ఏర్పాటును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అసెంబ్లీ వేదికగా, ఢిల్లీ స్థాయిలో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. గరీబ్‌పేట, సుజాతనగర్ ప్రాంతాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చేసిన నిరంతర ప్రయత్నాలు, సంబంధిత శాఖలతో సమన్వయం విమానాశ్రయ ప్రతిపాదనలో కీలక ముందడుగుకు దోహదపడ్డాయని స్థానిక వర్గాలు పేర్కొంటున్నాయి.

అన్ని ప్రాంతాలకు అందుబాటులో..

సుజాతనగర్ వద్ద ఎంపిక చేసిన ప్రాంతం ప్రధాన రహదారికి 3.4 కిలోమీటర్లు, కొత్తగూడెం రైల్వే స్టేషన్‌కు 5.7 కిలోమీటర్లు, భద్రాచలానికి 35.4 కిలోమీటర్ల దూరంలో ఉండటం రవాణా పరంగా అనుకూలంగా మారనుంది. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే పారిశ్రామిక రంగంతో పాటు పర్యాటక, వాణిజ్య, ఉపాధి రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. ముఖ్యంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడే అవకాశం ఉంది.

త్వరలో భూసేకరణ.. మలిదశ పనులు

స్థల ఎంపికకు సంబంధించిన సానుకూల పరిణామాల నేపథ్యంలో తదుపరి దశలో భూసేకరణ, ఇతర సాంకేతిక, పరిపాలనా అనుమతుల ప్రక్రియపై కసరత్తు జరగాల్సి ఉంది. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన తదుపరి అధికారిక నిర్ణయాలపై జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న విమానాశ్రయ కల కార్యరూపం దాల్చితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా నిలవనుంది.



సామాజికన్యాయ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర కీలకం

- **తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కమీషన్ ముఖ్య కమీషనర్ జస్టిస్ ఈద తిరుమలదేవి**

వరంగల్, నవంబరు 14 (భద్రాద్రిన్యూస్):-





80 ఏండ్ల స్వాతంత్ర దేశంలో నేటికి ఆయా సమూహాల మధ్య అసమానతలు కొనసాగుతున్నాయని, ప్రత్యేకించి కన్న తల్లితండ్రులను నిర్లక్ష్యం చేయడం, వారి ఆస్తిని లాక్కొని ఇంటి నుండి గెంటివేస్తూ అసమానతలు పెంచుతున్నారని సమాజంలోని సకల అసమానతలను తొలగించడంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కమీషన్ ముఖ్య కమీషనర్ జస్టిస్ ఈద తిరుమల దేవి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కేంద్రం హంటర్ రోడ్ లోని 'డి' కన్వెన్షన్ లో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ 6వ రాష్ట్ర సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో గౌరవంగా జీవించే హక్కు కూడా ఉందని, అన్ని ఉండి ఇంటి నుండి గెంటి వేయబడుతున్న వృద్ధుల గూర్చి మాట్లాడి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు అకాడమి చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ సామాజిక అసమానతలను రూపుమాపి సమానత్వ సమాజ నిర్మాణంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని అన్నారు. స్వాతంత్ర ఉద్యమంలో న్యాయవాదుల కీలకపాత్ర పోషించారని, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా న్యాయవాదులు త్యాగపూరిత పోరాటం చేశారని నేడు దేశ వ్యాప్తంగా జరుగుతున్న సామాజిక న్యాయ ఉద్యమంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించడం ఆనందపడాల్సిన విషయమని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా మెజార్టీ ప్రజలైన బహుజన వర్గాల హక్కులను సాధించి వారి వాటా సాధించడంలో న్యాయవాదులు అవసరముందని అన్నారు. అంబేద్కర్ న్యాయవాది కాబట్టే అణగారిన ప్రజలకు ఎన్నో హక్కులను రాజ్యాంగంలో పొందుపర్చారని ఆ హక్కులను సాధించడం కోసం న్యాయ బద్ధంగా పోరాటం చేయడంతో పాటు అణగారిన వర్గాల ఐక్యతతో రాజకీయ అధికారం సాధించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎన్ జె శాంసన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ అంబేద్కర్ పిలుపునిచ్చిన 'పే బ్యాక్ టు సొసైటీ' లక్ష్యంగా నల్ల కోట్లతో నీలి విప్లవం నినాదంతో ఐ ఎల్ పి ఎ పనిచేస్తుందని మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేద్కర్ సిద్ధాంత పునాదితో నిరంతరం బహుజన అణగారిన పేద న్యాయవాదుల వృత్తి నైపుణ్యం కోసం కృషి చేస్తూనే బహుజన సమాజ చైతన్యం కోసం పని చేస్తున్నామని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని గ్రామ గ్రామానికి తీసుకెళ్లడమే ఐ ఎల్ పి ఎ లక్ష్యమని ఆయన అన్నారు. బి.సి మోర్చా జాతీయ అధ్యక్షులు చౌదరి వికాస్ పటేల్ అధ్యక్షతన జరిగిన సదస్సులో గౌరవ అతిథులుగా హనుమకొండ జిల్లా జడ్జిలు ఎం.ఆర్. సునీత వరంగల్ మొదటి అదనపు జిల్లా జడ్జి మైత్రేయి మాట్లాడుతూ ఎన్నో కష్టాలకోర్చి లా చదివిన వారికి జీవితంలో సెటిల్ కావడం కష్టంగా ఉందని అన్నారు.

ప్రారంభ సెషన్ అనంతరం నాలుగు సెషన్లల్లో సదస్సు వైభవంగా జరిగింది. 79 ఏండ్ల స్వాతంత్ర భారతంలో మహిళా స్వేచ్ఛ అనే అంశంపై ప్రొఫెసర్ ఇ. సుధారాణి, ఎస్ ఐ ఆర్ పేరుతో ఓట్ల తొలగింపు అనే అంశంపై ప్రొఫెసర్ గుగులోతు వీరన్న నాయక్, సామాజిక న్యాయం బహుజనుల ఐక్యత అనే అంశంపై తెలుగు అకాడమీ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రజాస్వామ్యంలో జడ్జీల నియామకం లోపాలు అనే అంశంపై ఐ ఎల్ పి ఎ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పొన్నం దేవరాజు గౌడ్ ఉపన్యాసాలు ఇచ్చారు. వీరితో పాటు మెటుపల్లి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ రాజారాం, బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షులు దాసురాం నాయక్, ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి రమేష్, బ్యాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి నరేందర్,
బ్యాంసెఫ్ నాయకులు ఎ సంతోష్ కుమార్, ఐ ఎల్ పి ఎ నాయకులు తిప్పన డాంగే, తీగల జీవన్ గౌడ్, వి.ఎం. కృష్ణారెడ్డి, అనంత ఆంజనేయులు, భానుప్రియ, చిల్ల రమేష్, టి. డేవిడ్, మహమ్మద్ ముధసిర్ అహ్మద్, వెంకటయ్య ముదిరాజ్ తదితర మేధావులు హాజరై సందేశాలు ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, సదస్సు కన్వీనర్ ప్రారంభోపన్యాసం ఇవ్వగా రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్ వందన సమర్పణ చేశాడు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఐ ఎల్ పి ఎ నాయకులు జన్ను పద్మ, సామ హేమలత, లక్కినేని సత్యనారాయణ, మామిడాల సత్యనారాయణ, వల్లపు మధుసూదన్, బండి మొగిలి, భుజంగరావు, సిద్ధిరాములు, పులిగిల్ల భిక్షపతి, విలాసాగరం సురేందర్ గౌడ్, చింత సాంబశివరావు, పూసపల్లి శ్రీనివాస్, అవులూరి సత్యనారాయణ, రంగోజు బిక్షపతి, తల్లమల్ల హస్సేన్, గోపికృష్ణ, పూస మల్లేష్, ఎగ్గడి సుందర్ రామ్, మనీశ్వరి, బద్రు నాయక్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విషవాయువులతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

- **డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి**
- **అధికారుల నిర్లక్ష్యంతో రోగాల బారిన పడుతున్నాం**
- **నివాసాల మధ్య చెత్త డంప్ చేయడం దుర్మార్గం**
- **బాధితుడు కోట రమేష్**

కొత్తగూడెం అర్బన్ ,నవంబర్ 14 (భద్రాద్రిన్యూస్)

:డంపింగ్ యార్డు నుండి వెలువడుతున్న విషవాయువులతో స్థానిక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బాధితుడు కోట రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 11వ డివిజన్ (పాత కొత్తగూడెం) జనావాసాలకు సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వద్ద శనివారం స్థానికులు చెత్త వాహనాలను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం టౌన్ పరిధిలోని 29 డివిజన్ల చెత్తను నిత్యం భారీ మొత్తంలో ఇక్కడికి తరలిస్తున్నారని, కనీస రక్షణ చర్యలు లేకపోవడంతో చెత్త తడిసినప్పుడు, నిప్పుపెట్టినప్పుడు తీవ్రమైన విషవాయువులు వెలువడుతున్నాయని తెలిపారు. ఈ కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, చర్మ వ్యాధులు, విషజ్వరాల బారిన పడి స్థానికులు ఆసుపత్రుల పాలవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా తమ కుటుంబ సభ్యులంతా ఈ విషవాయువులు పీల్చి తీవ్ర అనారోగ్యం పాలయ్యారని వాపోయారు. గతంలో పలుమార్లు చెత్త వాహనాలను అడ్డుకుంటే పోలీసులతో ఆందోళనను విరమింపజేసి, రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఇప్పటికైనా తాత్కాలిక హామీలు కాకుండా డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ బాధ్యులు వచ్చి ఎప్పటిలాగే సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, శాశ్వత పరిష్కారం చూపే వరకు వెనక్కి తగ్గేది లేదని స్థానికులు తెగేసి చెప్పడంతో చెత్త వాహనాలను వెనక్కి తీసుకెళ్లి కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోనే చెత్తతో పాటు నిలిపివేయడం గమనార్హం. సమస్యను పరిష్కరించకుండా వాహనాలను ఆఫీసు ఆవరణలో ఉంచడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు





హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో స్వయంపాలనా దినోత్సవం ఘనం!

- **ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించిన పదో తరగతి విద్యార్థులు**
- **ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ పోటీలతో సందడిగా బాలల దినోత్సవం**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్):

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో స్వయంపాలనా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
తమకు ఇష్టమైన సబ్జెక్టులపై ముందుగానే పూర్తిస్థాయిలో సన్నద్ధమై తరగతి గదుల్లో అద్భుతంగా బోధించారు. ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు పాఠాలు బోధించడంలో ఎదురయ్యే సవాళ్లను ప్రత్యక్షంగా అనుభవించి, ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఎంతటి కసరత్తు చేస్తారో తెలుసుకున్నామని పేర్కొన్నారు.
బాలల దినోత్సవ వేడుకల్లో భాగంగా ఓల్గా, నైల్, ఇండస్, అమెజాన్ గ్రూపుల మధ్య జస్ట్ ఏ మినిట్, 3డీ ఆర్ట్, కామిక్ స్ట్రిప్, శిల్పకళ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. థీమ్ ఆధారిత నృత్య పోటీలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మైదానంలో నిర్వహించిన వేడుకలు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగ వాతావరణాన్ని తలపించాయి.
ఈ సందర్భంగా హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించడం ద్వారా బోధనా ప్రక్రియలోని సాధకబాధకాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం స్వయంపాలనా దినోత్సవం కల్పిస్తుందని అన్నారు. విద్యార్థులు తమ అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని, ఉపాధ్యాయులు చెప్పే ప్రతి విషయాన్ని శ్రద్ధగా వినడం ద్వారా మెరుగైన అవగాహన పొందవచ్చని సూచించారు.
పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ దినోత్సవ విశిష్టతను వివరించారు. విద్యార్థుల్లోని బిడియాన్ని తొలగించి, స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తపరిచేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించి, వారి ఆలోచనా శక్తి, సృజనాత్మకతను పెంపొందించేందుకు పాఠశాల కృషి చేస్తోందన్నారు. సామాజిక స్పృహ, వ్యక్తిగత బాధ్యతలతో కూడిన విద్యావిధానానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



నెహ్రూ ఆశయాల వారసులుగా ఎదగాలి...

- **త్రివేణి విద్యార్థులకు డా. గొల్లపూడి వీరేంద్రచౌదరి పిలుపు**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 14 (భద్రాద్రిన్యూస్):-

త్రివేణి పాఠశాలలో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చాచా నెహ్రూ వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు.
ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ, బాలలే దేశ భవిష్యత్తు అని, వారి సృజనాత్మకతను, ప్రతిభను ప్రోత్సహిస్తూ మంచి విద్యా విలువలు, క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పిల్లల పట్ల నెహ్రూకు ఉన్న ప్రేమాభిమానాలు, బాలల అభ్యున్నతిపై ఆయనకున్న ఆకాంక్షలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు.
ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, చాచా నెహ్రూ జీవిత విశేషాలు విజన్ విజయాలను గుర్తు చేస్తూ...బాలల దినోత్సవం విద్యార్థుల్లో ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మకతను పెంపొందించే వేడుక అని అన్నారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయినీఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.



ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా
మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి

- **మృతుడి అంత్యక్రియల కోసం రూ.5 వేల ఆర్థిక సహాయం**
- **కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మంలోని సారధి నగర్‌కు చెందిన చెన్నబోయిన శ్రీను గుండెపోటుతో శనివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మృతుడి అంత్యక్రియల నిర్వహణ నిమిత్తం కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్రీను మొదటి నుంచి స్థానిక ప్రజలతో కలిసిమెలిసి ఉండేవారని, గత కొంతకాలంగా పక్షవాతం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారని తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీ తరఫున బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సహాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు షేక్ రజ్జి, నాయకులు దయ్యాల నాగేశ్వరరావు, బుంగ శ్రీనివాస్ యాదవ్, ఆముదాల వెంకట నారాయణ, స్థానికులు పాల్గొన్నారు.



బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు చేరాలంటే
ఓబీ తొలగింపులో వేగం పెంచాలి!

ఏజెన్సీల పట్ల యాజమాన్యం ఉదాసీనంగా ఉండబోదని హెచ్చరించారు.

ఏరియాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు:

కొత్తగూడెం ఏరియా: రోజుకు 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 55 వేల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు.

సత్తుపల్లి ఏరియా: రోజుకు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.40 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు.

మణుగూరు ఏరియా: రోజుకు 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.25 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు.

ఇల్లందు ఏరియా: రోజుకు 5 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 10 వేల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు.

ఓబీ లక్ష్యాల సాధనలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించుకోవాలని ఏజెన్సీలకు సూచించారు. భద్రతతో కూడిన బొగ్గు ఉత్పత్తి, నాణ్యతతో కూడిన బొగ్గు రవాణాకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

వచ్చే కొద్ది నెలల్లో కాంట్రాక్టు కాలపరిమితి ముగియనున్న గనులపై కూడా సమీక్షించారు. ఆయా గనులకు సంబంధించి కొత్త కాంట్రాక్టు ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేసి అవసరమైన అనుమతులు పొందాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ సమీక్షలో సంస్థ డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, తిరుమల రావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి. శ్రీనివాస్, జీఎం (సీపీపీ) దేవేందర్, కొత్తగూడెం ఏరియా జీఎం వెంకటరమణ, మణుగూరు ఏరియా జీఎం దుర్గం రాంచందర్, సత్తుపల్లి ఏరియా జీఎం వెంకటాచారి, ఇల్లందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్యతో పాటు కార్పొరేట్ అధికారులు, సంబంధిత గనుల అధికారులు, ఓవర్ బర్డెన్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



సర్వజ్ఞ స్కూల్‌లో అలరించిన
బాలల దినోత్సవ వేడుకలు

ఖమ్మం ప్రతినిధి, నవంబరు 14 (భద్రాద్రిన్యూస్):-

ఖమ్మం నగరంలోని వి.డి.ఓస్ కాలనీలో గల సర్వజ్ఞ విద్యాసంస్థల్లో నవంబర్ 14న బాలల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో జరిపారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నెహ్రూ గారి జీవిత విశేషాలు, బాలల పట్ల ఆయనకున్న ప్రేమ గురించి వివరించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. సర్వజ్ఞ సూపర్ కిడ్జ్ ప్రీప్రైమరీలో నర్సరీ, ఎల్.కె.జి, యు.కె.జి మరియు మొదటి రెండవ తరగతి చిన్నపిల్లల డాన్సులు ఆకర్షణగా నిలిచాయి., హై స్కూల్ ఇన్‌స్ట్రుమెంటల్ & రాంప్ వాక్, పాటలు, డాన్సులు స్కిట్లు, ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా పిల్లలు వేసిన రోబో వేషధారణ మరియు వివిధ రాష్ట్రాల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ.. పిల్లలు క్రమశిక్షణతో చదువులో రాణించాలని, దేశ భవిష్యత్తుకు పునాది రాళ్లయిన విద్యార్థులు మంచి విలువలను అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





చిన్నారుల సందడితో స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్‌లో బాలల దినోత్సవ వేడుకలు

- **నెహ్రూ ఆశయాలను విద్యార్థులు ఆచరించాలి**
- **డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు.. ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న స్టెమ్‌స్పార్క్ రెజోనెన్స్ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం చిన్నారుల సందడి, ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడింది.

ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు హాజరై మాట్లాడుతూ.. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ప్రేమ అని, అందుకే చిన్నారులు ఆయనను ఆప్యాయంగా చాచా నెహ్రూ అని పిలిచేవారని తెలిపారు. పిల్లలే దేశానికి నిజమైన సంపద, భవిష్యత్తు అని నెహ్రూ విశ్వసించేవారని పేర్కొన్నారు. విద్యార్థులు సత్యం, శాంతి, కఠోర శ్రమ వంటి విలువలను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి పాఠశాల నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

కొండా కృష్ణవేణి మాట్లాడుతూ.. బాలల దినోత్సవం కేవలం వేడుక మాత్రమే కాదని, చిన్నారుల కలలు, అవసరాలు, అభిరుచులను అర్థం చేసుకొని వారికి తగిన ప్రోత్సాహం అందించాల్సిన బాధ్యతను గుర్తుచేసే రోజని అన్నారు. ప్రతి చిన్నారిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విలువలతో కూడిన విద్య, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లలలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు డాక్టర్లు, సైనికులు, ఉపాధ్యాయులు, జాతీయ నాయకుల వేషధారణల్లో అలరించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుతూ సభికులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన చిన్నారులను అభినందించి బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె. సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నాయకత్వ పట్టాభిషేకం.. బాలల దినోత్సవ సంబరాలు!

- **విద్యార్థి నాయకులకు బాధ్యతల అప్పగింత.. ఘనంగా ప్రమాణ స్వీకారం**
- **నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులు**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అండ్ ప్లస్ వన్, ప్లస్ టూ సీబీఎస్ఈ కళాశాలలో ఇన్వెస్టిచర్ సెరిమనీ (విద్యార్థి నాయకత్వ బాధ్యతల స్వీకార కార్యక్రమం), బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావం, బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ నాయకత్వ బాధ్యతలను అప్పగించి భుజకవచాలు (సాషెస్), బ్యాడ్జీలను అందజేశారు. అనంతరం నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో, నిజాయితీతో, అంకితభావంతో నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు ఉత్సాహంగా మార్చ్‌పాస్ట్ నిర్వహించి తమ క్రమశిక్షణ, ఐక్యతను ప్రదర్శించారు.

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు వివిధ రకాల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. రంగురంగుల దుస్తుల్లో చిన్నారులు చేసిన నృత్యాలు, కళా ప్రదర్శనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె. రవీందర్ రెడ్డి, డైరెక్టర్ పి. వినీతా రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.ఎల్. రణధీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులే రేపటి నాయకులని, చిన్నతనం నుంచే బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని అలవర్చుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





నెహ్రూ ఆశయాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

- **కాల్వొడ్డు నెహ్రూ చౌక్‌లో ఘనంగా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు – విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**

ఖమ్మం ప్రతినిధి ,నవంబరు 14(భద్రాద్రిన్యూస్) :-

భారత తొలి ప్రధానమంత్రి, ఆధునిక భారతదేశ నిర్మాణ శిల్పి, దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కాల్వొడ్డు నెహ్రూ చౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించి ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు.

స్థానిక మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, అర్బన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత దేశ తొలి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కాకుండా విద్య, విజ్ఞాన, సాంకేతిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని పేర్కొన్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో నెహ్రూ పోషించిన పాత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోతుందని అన్నారు.

నాటి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి నేటి రాహుల్ గాంధీ వరకు గాంధీనెహ్రూ కుటుంబం భారతదేశ ప్రజాసేవకు అంకితమైందని, దేశ ప్రజల సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం ఆ కుటుంబం విశిష్టమైన సేవలు అందిస్తోందని నాయకులు కొనియాడారు. నెహ్రూ ఆశయాలు, ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

అనంతరం చాచా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాళం సతీష్, షేక్ రజ్జి, తొగరు భాస్కర్, బాల్దె నాగేశ్వరరావు, ఎమ్మె రామకృష్ణ, దేవర వెంకన్న, గొనెల రవిశంకర్, కన్నం రమేష్, పత్తికొండ శ్రీను, షేక్ జానీ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





19వ డివిజన్‌కు 92 కొత్త పింఛన్లు మంజూరు!

- **లబ్ధిదారులకు స్వయంగా ఫోన్ చేసి సమాచారం అందించిన మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ**
- **వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్):



ఖమ్మం నగరంలోని 19వ డివిజన్ ప్రజలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. డివిజన్ పరిధిలో కొత్తగా 92 పింఛన్లను మంజూరు చేసింది. ఇందులో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళల పింఛన్లు ఉన్నాయి.

ఈ సందర్భంగా 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ కొత్తగా పింఛన్లు మంజూరైన 92 మంది లబ్ధిదారులకు స్వయంగా ఫోన్ చేసి సమాచారం అందించారు. పింఛన్లు మంజూరైన విషయం తెలుసుకున్న పలువురు లబ్ధిదారులు భక్త రామదాసు కళాక్షేత్రానికి చేరుకున్నారు. అందుబాటులో లేని మిగతా లబ్ధిదారులకు కూడా సంబంధిత అధికారులు, మాజీ కార్పొరేటర్ ద్వారా సమాచారం అందించనున్నారు.

ఈ సందర్భంగా చామకూరి వెంకటనారాయణ మాట్లాడుతూ.. 19వ డివిజన్ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ధరమళ్ల భాస్కర్, పాషా, బాల, శ్యామలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త!

- **శబరిమల యాత్రకు ఖమ్మం డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు**
- **పంచారామాలు, అన్నవరం, అరుణాచలానికి కార్తీక మాస ప్రత్యేక యాత్రలు**
- **ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవాలి.. డిపో మేనేజర్ శివప్రసాద్**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్):

అయ్యప్ప స్వామి దర్శనానికి శబరిమల వెళ్లే భక్తులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) శుభవార్త అందించింది. భక్తుల సౌకర్యార్థం ఖమ్మం డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. భక్తుల అభ్యర్థన మేరకు 36 సీట్ల సామర్థ్యం కలిగిన సూపర్ లగ్జరీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు తమకు అనువైన తేదీల్లో ఐదు లేదా ఏడు రోజుల యాత్ర కోసం ముందస్తుగా బస్సులను బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు.

కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక యాత్రలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ఖమ్మం డిపో నుంచి పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు.

పంచారామాల యాత్ర:

అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించేలా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. నవంబర్ 15, 22, 29 తేదీలతో పాటు డిసెంబర్ 6వ తేదీన ఉదయం 8 గంటలకు ఖమ్మం నుంచి బస్సులు బయలుదేరుతాయి.

సర్వీస్ నంబర్: 98681
పెద్దలకు టికెట్ ధర: రూ.2,300
పిల్లలకు టికెట్ ధర: రూ.1,200

అన్నవరం యాత్ర:

ఖమ్మం నుంచి అన్నవరం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. నవంబర్ 15, 22, 29 తేదీలతో పాటు డిసెంబర్ 6వ తేదీన ఉదయం 8 గంటలకు బస్సులు బయలుదేరుతాయి.

సర్వీస్ నంబర్: 90350
పెద్దలకు టికెట్ ధర: రూ.750
పిల్లలకు టికెట్ ధర: రూ.420

ఖమ్మం – అరుణాచలం గిరి ప్రదక్షిణ:

అయ్యప్ప, శివ భక్తుల సౌకర్యార్థం ఖమ్మం నుంచి అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. నవంబర్ 22, ఆదివారం ఉదయం 7 గంటలకు బస్సు బయలుదేరుతుంది.

సర్వీస్ నంబర్: 98601
టికెట్ ధర: రూ.5,000

భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందస్తుగా టికెట్లను రిజర్వేషన్ చేసుకోవాలని డిపో మేనేజర్ శివప్రసాద్ కోరారు. తక్కువ ధరల్లో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రిజర్వేషన్లు, మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు: 9959225958, 9063414561, 9136446666.



పట్టాదారు పాస్ బుక్కులు ఇప్పించండి

- **16 ఏళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు**
- **మీడియా సమావేశంలో గోడు వెళ్లబోసుకున్న బాధితుడు చింతనిప్పు సత్యం**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 14 (భద్రాద్రిన్యూస్):-



చింతకాని మండలం కొదుమూరు రెవెన్యూ పరిధిలోని 327 సర్వే నెంబర్‌లో ఉన్న 29.14 కుంటల భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలను ఇప్పించాలని బాధిత రైతు చింతనిప్పు సత్యం వేడుకున్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన సత్యం మాట్లాడుతూ 16.27 కుంటల భూమికి పాత పాస్‌బుక్ ఉందన్నారు. మిగిలిని దానికి పహణీ ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక తనకు కొత్తపాస్ పుస్తకం ఇవ్వలేదన్నారు. అనేక కొర్రీలు పెట్టి చింతకాని రెవెన్యూ అధికారులు తన భూమికి పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదన్నారు. 16 ఏళ్లుగా తిరుగుతున్నా కనికరించడం లేదన్నారు. పలుమార్లు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌డేలో వినతిపత్రం అందచేశానన్నారు. ఇటీవల రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా వినతిపత్రం ఇచ్చానన్నారు. అయినా తన సవుస్యకు పరిష్కారం దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల చింతకాని తహశీల్దార్ మెమో ఇచ్చారని, దీనిపై తేదీ లేదని, ఇది తప్పుడు మెమో అని ఆరోపించారు. మెమోలో పరంగల్‌కు చెందిన కుమార స్వామికి చెందిన లారెల్ ఎడ్యుకేషన్ సొసైటీకి తాను భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లుగా మెమోలో పేర్కొన్నారని, ఇది అవాస్తవని, ఇప్పటికీ ఈసిలో తన పేరు వస్తోందని తెలిపారు. మెమోపై తహశీల్దార్‌ను అడుగగా తనను కోర్టుకు వెళ్లండంటూ చెబుతున్నారని తెలిపారు. వెంటనే రెవెన్యూ అధికారులు తన భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు.